క్లుప్తంగా

నేడు మండలంలో విద్యుత్ సరఫరా నిలిపివేత

కన్నాయిగూడెం : ఈనెల 14న ఉదయం 9 గంటల నుంచి మండలంలో విద్యుత్ సబ్‌స్టేషన్ మరమ్మతుల దృష్ట్యా విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు విద్యుత్ శాఖ అధికారులు శుక్రవారం తెలిపారు. ఏటూరునాగారం నుంచి కన్నాయిగూడెం వచ్చే 33 కేవీ లైన్‌లో ఇన్సులేటర్‌ను మార్చుతున్నందున ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12. 30 వరకు, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 4.30 వరకు విద్యుత్ సరఫరా నిలిపియేయనున్నట్లు తెలిపారు. విద్యుత్ అంతరాయానికి మండల ప్రజలు గమనించి సహకరించాలని కోరారు.

యూటీఎఫ్ సభ్యత్వ నమోదు

మంగపేట: మండలంలోని వివిధ ప్రభుత్వ పాఠశాలలను పర్యవేక్షిస్తూ ఉపాధ్యాయుల నుంచి తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ సభ్యత్వ నమోదు రెండో రోజు కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమంలో పలువురు సీనియర్ ఉపాధ్యాయులు పాల్గొని ప్రభుత్వ పాఠశాలల్లో పేద బడుగు బలహీన వర్గాల విద్యార్థులకు మంచి విద్యను బలోపేతం చేసే విధంగా ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో యూటీఎఫ్ మండల అధ్యక్షకార్యదర్శులు గుండం పురుషోత్తం, జాటోత్ సురేష్‌నాయక్ జిల్లా కోశాధికారి వెంకటస్వామి, సీనియర్ నాయకులు శ్రీనివాస్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

మీటరు ఉంటేనే గృహజ్యోతి

మంగపేట: ప్రజలు విద్యుత్ కనెక్షన్ తీసుకుని మీటర్ అమర్చుకుంటనే ప్రభుత్వ అమలు చేస్తున్న గృహలక్ష్మి పథకం(ఉచిత విద్యుత్) పొందే అవకాశం ఉంటుందని మండల ట్రాన్స్‌కో ఇన్‌చార్జ్ ఏఈ కృష్ణారావు అన్నారు. ప్రభుత్వం నిరుపేదలకు తక్కువ ధరకు రూ.938కి 500 వాట్స్ వరకు నూతనంగా విద్యుత్ కనెక్షన్ ఇచ్చి మీటర్ అమర్చుతున్నట్లు ఆయన తెలిపారు. ప్రజలు సమాచారం ఇచ్చేందుకు కోమటిపల్లి, కొత్తూరుమొట్లగూడెం, మంగపేట గ్రామాల్లో ప్రచారం చేస్తునట్లు తెలిపారు.

రైతులందరికీ రుణమాఫీ చేయాలి

ఎస్ఎస్‌తాడ్వాయి : బ్యాంకుల్లో వ్యవసాయ రుణాలు తీసుకున్న జిల్లాలోని గిరిజన, గిరిజనేతర రైతులందరికీ రుణమాఫీ చేయాలని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు మల్లెల రాంబాబు ప్రభుతాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ 2018 ముందు రెన్యువల్ చేసుకుని వందలాది మంది రైతులకు రుణమాఫీ వర్తించలేదన్నారు. రాష్ట్రమంత్రి వర్గంలో ప్రాతినిధ్యం వహిస్తున్న మంత్రి సీతక్క రుణమాఫీ కానీ రైతులందరికీ రుణమాఫీ అయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. రుణమాఫీ విషయాన్ని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తామన్నారు.


పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడిగా శ్రీనివాస్

వెంకటాపురం(కె): పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడిగా బొల్లే శ్రీనివాస్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. శుక్రవారం మండల కేంద్రంలో పీఆర్‌టీయూ మండల కమిటీ సమావేశం నిర్వహించారు. సమావేశానికి ముఖ్య అతిథులుగా జిల్లా అధ్యక్షుడు రమేష్, కార్యదర్శి యకుబ్‌రెడ్డి హాజరయ్యారు. మండల అధ్యక్షుడిగా బొల్లే శ్రీనివాస్, కార్యదర్శిగా వీరన్న అసోసియేటివ్ అధ్యక్షుడిగా రాజేశ్వరావు, మహిళా ఉపాధ్యక్షురాలిగా విజయశ్రీ, కార్యదర్శిగా వెంకటరమణ, కోశాధికారిగా నాగేశ్వరావు , ఉపాధ్యక్షులుగా నాగిరెడ్డి, ఎల్.రమేశ్‌లను ఎన్నుకున్నారు.

సన్మానం

ఎస్ఎస్‌తాడ్వాయి: వర్షాల వరదల సమయంలో సహకరించిన జేసీబీ యజమానులు, డ్రైవర్లను, కట్టర్లను స్థానిక ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం శాలువాలతో సన్మానించారు. జేసీబీ యజమానులు మల్లయ్య, సాగర్, సురేందర్, సృజన్‌రెడ్డి, శ్యామ్, వేణుగోపాల్‌రెడ్డి, శివానంద్, ట్రీ కట్టర్ ఇర్ప నాగేష్, సురబాక ప్రసాద్‌లతోపాటు డ్రైవర్లను ఎస్సై సన్మానించారు. ప్రజలకు కలిగే ఇబ్బందులు సమయంలో సాయం చేసేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలన్నారు.

ప్రతి గీత కార్మికుడు సభ్యత్వం కలిగి ఉండాలి



వెంకటాపురం(ఎం): ప్రతి గీత కార్మికుడు సంఘంలో తప్పకుండా సభ్యత్వం కలిగి ఉండాలని ములుగు ఎక్సైజ్ సీఐ సుధీర్ కుమార్ పిలుపునిచ్చారు. శుక్రవారం మండలంలోని లక్ష్మీదేవిపేటలో 50 మంది కల్లుగీత కార్మికులకు టాపింగ్ టెస్ట్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ గీత కార్మికులకు సభ్యత్వం కార్డు ఉంటేనే ప్రభుత్వ సంక్షేమ పథకాలు వర్తిస్తాయన్నారు. కల్లుగీత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు పులి నర్సయ్య, సదయ్య, శంకర్, మల్లయ్య, రమేష్, సదానందం, కుమార్, పున్నం, శ్రీనివాస్, పాల్గొన్నారు.

సీబీ పుస్తకాల్లో అవకతవకలు

- సమర్థించే పనిలో అధికారులు
- విజిలెన్స్, ఆడిట్ బృందం వస్తే నిజాలు బహిర్గతం



ఏటూరునాగారం గ్రామపంచాయతీ కార్యాలయం

ఏటూరునాగారం: గ్రామ పంచాయతీ పాలన వారి ఇష్టారాజ్యమైంది. ఆడిందే ఆటా పాడిందే పాటగా మారింది. జనాల నుంచి వసూలు చేసిన డబ్బులను సక్రమంగా చలాన్ ద్వారా బ్యాంకుల్లో జమ చేసి ఆ తర్వాత గ్రామ పంచాయతీ అవసరాలకు వినియోగించుకోవాల్సి ఉంది. కానీ ఇక్కడ విరుద్ధంగా జరుగుతోంది. వసూలు చేసిన డబ్బులు సైతం వారి ఇష్టానుసారంగా ఖర్చు చేసి బిల్లులు పెడుతూ లెక్కలు రాస్తున్నారు. ఈ ఘటన ఏటూరునాగారం గ్రామపంచాయతీలో చోటు చేసుకుంది. గ్రామంలో కొత్త ఇల్లు అయినా.. కరెంటు మీటర్లు అయినా కూడా వేలాది రూపాయలు ముడుపులు చెల్లించాల్సి వస్తోంది. రశీదు మాత్రం నాలుగు అంకెల్లో ఉంటే చేతికి అందేది మాత్రం ఐదు అంకెల్లో ఉంటుంది. జీపీ పరిధిలోని ఇళ్ల నుంచి వసూలు చేసిన ఇంటి పన్నుల రశీదుల వివరాలను సీబీ (క్యాష్‌బ్యాలెన్స్) పుస్తకాలో రాయాల్సి ఉంటుంది. అయితే వసూలు చేసేది కొండంత అందులో రాసేది గోరంతగా ఉంది. ఈ విషయం పంచాయతీ అధికారికి తెలియడంతో దానిని సరిచేసేందుకు కూడా మామూళ్లు తీసుకున్నట్లు తెలుస్తోంది. జీపీలో పనిచేసే సిబ్బంది ఈ సీబీ బుక్కులను మెయింటనెన్స్ చేస్తుంటారు. సీబీ బుక్కులో ఉన్న లెక్కలను సరిదిద్దేందుకు అధికారులు సైతం సదరు సిబ్బంది వద్ద ముడుపులు వసూలు చేసినట్లు ప్రచారం జోరుగా సాగుతుంది.

ఇసుక రశీదులు మాయం

ఇటీవల గ్రామ పంచాయతీ పరిధిలో ఇసుక క్వారీలు నిర్వహించారు. గ్రామ పంచాయతీ అభివృద్ధి నిధుల పేరుతో ఒక లారీకి రూ. 100ల చొప్పున వసూలు చేశారు. ఇలా 42 రశీదు పుస్తకాలను వాడారు. కానీ కేవలం 22 పుస్తకాలే వాడినట్లు ఆధారాలను చూపిస్తున్నారు. మిగతా డబ్బులు ఏమైనట్లు అనే అనుమానాలు లేవనెత్తుతున్నాయి. ఇలా అనేక అక్రమాలకు అడ్డాగా మారింది. ఎలాంటి ఆదాయం గ్రామ పంచాయతీకి వచ్చినా బ్యాంక్‌లో గ్రామ పంచాయతీ జనరల్ అకౌంట్‌కు చలాన్ తీసి అందులో జమ చేయాల్సి ఉంటుంది. కానీ ఇక్కడ అలాంటివి ఏమిలేకుండానే వారికి ఇష్టానుసారంగా డ్రా చేసుకోవడం పరిపాటిగా మారింది. ఇటీవల ఓ ప్రధాన పార్టీ నాయకులు గ్రామ పంచాయతీ అధికారులను ప్రశ్నించగా వారి చేతులు తడిపి నోరు మూయించినట్లు తెలుస్తోంది. ఇలాంటి అవినీతి అక్రమాలకు పాల్పడే అధికారులు, సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ఈ విషయంపై పంచాయతీ కార్యదర్శి రమాదేవిని వివరణ కోరగా సీబీ పుస్తకాలను సరిచేయడం జరుగుతుంది. చిన్న చిన్న పొరపాట్లున్నాయి. ఇసుక రశీదులు దాచిపెట్టడం జరిగిందని, వాటిని వివరాలు తర్వాత ఇస్తామని చెప్పారు.

అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరు



ఏటూరునాగారం: పోలీస్‌స్టేషన్‌లో అరెస్టు అయిన బీఆర్ఎస్ నాయకులు



వెంకటాపురం(కె)లో..

ఏటూరునాగారం : అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరని, ప్రజల పక్షాన నిలబడి పోరాడే పార్టీ బీఆర్ఎస్ అని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గడదాసు సునీల్‌కుమార్ అన్నారు. శుక్రవారం హైదరాబాద్‌లో బీఆర్ఎస్ నాయకులను అప్రజాస్వామ్యానికి విరుద్ధంగా అక్రమ అరెస్టులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. దీంతో స్థానిక పోలీసులు బీఆర్ఎస్ నాయకులను అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ హుజూరాబాద్ ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి ఇంటిపై దాడి చేయగా పరామర్శకు వెళ్తున్న మాజీ మంత్రులు తన్నీరు హరీష్‌రావు, సబితా ఇంద్రారెడ్డి, ప్రశాంత్‌రెడ్డి, గంగుల కమలాకర్‌లను అక్రమంగా అరెస్టు చేయడం హేమనీయమైన చర్య అన్నారు. కార్యక్రమంలో నాయకులు తుమ్మ మల్లారెడ్డి, కూనూరు అశోక్, ఈసం రామ్మూర్తి, ధన్నపునేని కిరణ్, కుమ్మరి చంద్రబాబు, వావిలా రాంబాబు, ఇట్టెం నాగరాజు, పాలకుర్తి శ్రీనివాస్, కాళ్ల రామకృష్ణ పాల్గొన్నారు.

వెంకటాపురం(కె): చలో హైదరాబాద్ కార్యక్రమానికి వెళ్తున్న బీఆర్ఎస్ నాయకులను శుక్రవారం పోలీసులు ముందస్తుగా అరెస్టు చేశారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షులు గంపా రాంబాబు హైదరరాబాద్ కార్యక్రమానికి వెళ్లకుండా పోలీసులు అక్రమంగా అరెస్టు చేయటాన్ని తీవ్రంగా ఖండించారు. అరెస్టు అయిన వారిలో రాంబాబు, బీఆర్ఎస్ అధికార ప్రతినిధి డర్రా దామోదర్, నాయకులు ముదుంబ శ్రీనివాస్, గద్దం వివేక్, యూత్ అధ్యక్షులు కొండపర్తి శివకృష్ణ, రవి, రాకేష్, నామన సాయి, సతీష్, తుమ్మ రామకృష్ణ ఉన్నారు.

మంగపేట: మండలంలోని పలువురు బీఆర్ఎస్ ముఖ్య నాయకులను పోలీసులు శక్రవారం ముందస్తు అరెస్టు చేసి స్థానిక పోలీస్ సేటసస్‌కు తరలించారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కుడుముల లక్ష్మీనారాయణ, మంగపేట ఎఫ్ఎస్‌సీఎస్ చైర్మన్ తోట రమేష్, బీఆర్ఎస్ మండల సోషల్ మీడియా ఇన్‌చార్జ్ గుడివాడ శ్రీహరిని అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. అనంతరం సొంత పూచీకత్తుపై వదిలేశారు.

సీతారాం ఏచూరికి ఘననివాళి



వాజేడు: మాట్లాడుతున్న తుమ్మల వెంకటరెడ్డి



ములుగు రూరల్ : నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

వాజేడు : సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి అకాల మృతిపై మండల కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం నివాళులర్పించారు. మండలంలోని వాజేడు, పూసూరు గ్రామాల మధ్యన ఉన్న గుడిసెల కేంద్రం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో భాగంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి తుమ్మల వెంకటరెడ్డి మాట్లాడుతూ కుల, మత అంతరాలు లేని సమాజం, సమసమాజ స్థాపన కోసం, బడుగు, బలహీన, శ్రామిక వర్గాల అభ్యున్నతి కోసం పరితపించిన వ్యక్తి సీతారాం ఏచూరి అని అన్నారు. ఆయన జీవితాన్ని కమ్యూనిస్టు పార్టీకి అంకితం చేసిన పోరాటయోధుడు, మహనీయుడు అస్తమించడం దేశ రాజకీయాలకు తీరని లోటన్నారు. ప్రతీ ఒక్కరు ఏచూరి ఆశయాలను ముందుకు తీసుకెళ్తేనే ఆయనకు నివాళులర్పించినట్లన్నారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు ఎండీ దావూద్, మండల కార్యదర్శి రఘుపతిరావు, దామోదర్, దేవయ్య, కృష్ణ బాబు, ముత్తయ్య, ప్రవీణ్ తదితరులున్నారు.

ఎస్ఎస్‌తాడ్వాయి: సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి ఏచూరి సీతారాం మృతి ప్రజాఉద్యమాలకు తీరని లోటని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కరెందుల సమ్మక్క అన్నారు. శుక్రవారం మండలంలోని కాటాపూర్‌లో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి సంతాపం ప్రకటించారు. సీఐటీయూ మండల నాయకుడు శ్రీనివాస్, అంగన్‌వాడీ టీచర్ సరిత పాల్గొన్నారు.

మంగపేట : ప్రజల అభ్యున్నతి కోసం పనిచేసిన సీపీఎం జాతీయ నేత సీతారాం ఏచూరి మరణం సీపీఎం పార్టీకి తీరని లోటని సీపీఎం మండల నాయకులు జాగటి చిన్నా, ఎల్పీ ముత్యాలు అన్నారు. కార్యక్రమంలో ఆటో యూనియన్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

ములుగు రూరల్: సీతారాం ఏచూరి సీపీఎం పార్టీ అభివృద్ధి కోసం నిరంతర కృషి చేశారని, ఆయన మృతి పార్టీకి తీరని లోటు అని పార్టీ ములుగు మండల కార్యదర్శి ఎండి గఫూర్ పాషా, సీపీఐ జిల్లా కార్యదర్శి జంపాల రవీందర్, జన్ను రవి అన్నారు. ములుగు అంబేడ్కర్ విగ్రహం వద్ద సీతారాం ఏచూరి మృతికి సంతాపం తెలియజేస్తూ, చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు ఎమ్మెస్ ప్రసాద్, రవి గౌడ్, ప్రవీణ్, దేవెందెర్, రవీందర్, రాజు, సాగర్, ఎస్ఎఫ్ఐ నాయకులు భిక్షపతి, సీపీఐ (ఎంఎల్) కొంరయ్య పాల్గొన్నారు.

వరద బాధితులకు నిత్యావసర కిట్లు పంపిణీ

ఏటూరునాగారం : మండలంలోని వరద ముంపు బాధితులకు స్మైల్ ఆల్వేస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం భూటారం, కొండాయి, మల్యాల గ్రామస్తులకు 320 నిత్యావసర కిట్లను శుక్రవారం ఆయా గ్రామాల్లో అందజేశారు. ఫౌండేషన్ అధ్యక్షుడు సుధామణుడు, ఐలాస్‌పాల్, కెవిన్ శివ, సామ్యూలేషన్, పాస్టర్ ప్రవీణ్, కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి గుడ్ల దేవేందర్, మండల అధ్యక్షుడు రఘు పాల్గొన్నారు.

జ్వరాలపై నిర్లక్ష్యం వహించొద్దు

వాజేడు: జ్వరాల పట్ల నిర్లక్ష్యం వహించొద్దని మాతాశిశు సంరక్షణ వైద్యాధికారిని యోషిత, ప్రగళ్లపల్లి పల్లె దవఖాన వైద్యాధికారిణి గ్యానస అన్నారు. మండలంలోని మొరుమూరు కాలనీ, కొంగాల, అరుణాచలపురం గ్రామాల్లో శుక్రవారం వైద్య శిబిరాలతో పాటు ఇంటింటి సర్వే నిర్వహించారు. 62 మంది రోగులను పరీక్షించి మందులను అందించినట్లు వైద్యులు వెల్లడించారు. జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ప్రత్యేక వైద్యశిబిరాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. జ్వరాలతో బాధ పడుతున్న వారి నుంచి రక్త నమూనాలను సేకరించారు. గర్భిణీలతో పాటు బాలింతలను పరిక్షించి మందులను ఇచ్చారు. ఈ సందర్భంగా రోగులను ఉద్దేశించి వారు మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ఇళ్లల్లో ప్లాస్టిక్ పరికరాలతో పాటు ఇతర పాత్రల్లో నిల్వ నీటిని ఉంచొద్దన్నారు. జ్వరాల తీవ్రత పెరుగుతున్న క్రమంలో జ్వరం బారిన పడిన ప్రతీ ఒక్కరు పాథమిక ఆరోగ్య కేంద్రాలకు వచ్చి వైద్యం చేయించు కోవాలని సూచించారు. కార్యక్రమంలో కోటిరెడ్డి, ఆసుపత్రి సిబ్బంది, ఏఎన్ఎం, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.



వాజేడు: రోగులకు వైద్యపరీక్షలు చేస్తున్న వైద్యాధికారులు

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

వెంకటాపురం(కె): సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారి స్నేహ అన్నారు. శక్రవారం మండలంలోని సూరవీడు, అంకన్నగూడెం, పాత్రాపురం, ఇప్పగూడెం గ్రామాల్లో వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో వైద్యశిబిరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులకు వైద్యపరీక్షలు నిర్వహించి మందులను అందజేశారు. అనంతరం గ్రామస్తులకు సీజనల్ వ్యాధులు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. కార్యక్రమంలో వైద్యాధికారులు ఆశిష్, వినయ్, సోహెల్, పవన్, సిబ్బంది జ్యోతి, మనోహర్, యాకలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

మంగపేట: మండలంలోని నర్సింహాసాగర్‌లో చుంచుపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి యమున ఆధ్వర్యంలో శుక్రవారం వైద్య శిబిరాన్ని నిర్వహించారు. 56 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. ముగ్గురు జ్వర పీడుతుల్ని గుర్తించి మలేరియా పరీక్షలు నిర్వహించగా నెగిటీవ్ రిపోర్టు రావడంతో మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పీహెచ్ఎస్ శైలజ, హెచ్‌వి పద్మ, ఏఎన్ఎం సారమ్మ, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

ఏటూరునాగారం: అటవీప్రాంతాల్లోని గిరిజనులు వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని కొండాయి వైద్యాధికారి ప్రణీత్‌కుమార్ అన్నారు. శుక్రవారం కన్నాయిగూడెం మండలం ఐలాపురం పంచాయతీ పరిధిలోని గొత్తికోయగూడెంలో వైద్యశిబిరాన్ని నిర్వహించారు. శిబిరంలో 106 మందికి మందులు అందజేశారు. అనంతరం ఇంటింటా జ్వరం సర్వేలు చేపట్టి 12 మందికి రక్తపరీక్షలు చేశారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ భాస్కర్‌రావు, ఏఎన్ఎం నాగమణి, ఆశ కార్యకర్తలు జయలక్ష్మి, పాల్గొన్నారు.



వెంకటాపురం(కె) : వైద్యపరీక్షలు చేస్తున్న డాక్టర్లు



మంగపేట : శనిగకుంటలో..



ఏటూరునాగారం : పరీక్షలు చేస్తున్న ప్రణీత్‌కుమార్

పూజలందుకుంటున్న గణనాథులు

ములుగు: నవరాత్రి ఉత్సవాల్లో గణనాథులు భక్తుల పూజలు అందుకుంటున్నారు. ములుగు జిల్లా కేంద్రంలో ఉత్సవ కమిటీ ఆహ్వానం మేరకు శుక్రవారం ఎస్సై వెంకటేశ్వరావు, మాజీ ఎంపీపీ గండ్రకోట శ్రీదేవిసుధీర్‌యాదవ్ హాజరై పూజలు చేశారు. భక్తులకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అన్నం పరబ్రహ్మం స్వరూపమని అన్నారు. హిందూ ధర్మంలో అన్నదానం ప్రాముఖ్యత ఎంతో కీలకమైనదని అన్నారు.

ఏటూరునాగారం: మండల కేంద్రంలోని రామాలయంలో గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా భక్తులు గరికతో మాలలు వేసి గణనాథుడికి ప్రత్యేక పూజలు చేశారు. 7వ రోజు శుక్రవారం భక్తులు రామాలయంలో ప్రత్యేక పూజలు చేపట్టారు. అర్చకులు యల్లాప్రగడ నాగేశ్వర్‌రావుశర్మ ప్రత్యేక పూజలు చేసి అర్చనలు చేశారు. అలాగే బొడ్రాయి వద్ద కుంకుమ పూజలను అర్చకులు రాధాకృష్ణశర్మ, సత్యనారాయణశర్మలు నిర్వహించారు.

వాజేడు: మండలంలోని వాజేడు, ధర్మవరం గ్రామాల్లోని సిద్ధివినాయక నవరాత్రుల మండపాల వద్ద గురువార రాత్రి కుంకుమార్చన పూజలు నిర్వహించారు. స్థానిక మహిళలు భారీ ఎత్తున తరలి వచ్చి పూజలో పాల్గొన్నారు.

మంగపేట : మండలంలోని వివిధ గ్రామాల్లో గణేశ్ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం విఘ్నేశ్వరస్వామికి ఆయా గ్రామాల ఉత్సవ కమిటీల నిర్వాహకుల ఆధ్వర్యంలో ప్రజలు, భక్తులు ఘనంగా పూజలు నిర్వహించారు. మండలంలోని కమలాపురం ఇందిరాకాలనీలోని వినాయకుడి మండపం వద్ద మహిళలు వినాయకుడిని దర్శించుకుని కుంకుమ పూజలు నిర్వహించి స్వామివారి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. అదే విధంగా గొల్లవాడలోని ఏకదంతుడికి దాతల సహకారంతో మాజీ జెడ్పీటీసీ, కాంగ్రెస్ ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు గుమ్మడి సోమయ్య ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించి అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కోమటిపల్లిక్రాస్‌రోడ్డు, నర్సింహాసాగర్ ఆర్టీసీ బస్టాండ్ వద్ద నిర్వాహకులు అన్నదానం చేపట్టారు.



ములుగు : ఉత్సవ కమిటీ సభ్యులతో ఎస్సై వెంకటేశ్వరరావు, మాజీ ఎంపీపీ శ్రీదేవి

గోవిందరావుపేట: మండల పరిధిలోని చల్వాయిలో 6వ వార్డులో గణనాథుని వద్ద శుక్రవారం ఆడపడుచులు కుంకుమార్చన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఆడపడుచులు అందరూ ఉపవాస దీక్షతో ఉండి కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. కార్యక్రమానికి సలేంద్ర రాజేంద్ర చారి చెప్పిన విధంగా మంత్రాల ఉచ్చరణతో భక్తిపార్వశంతో మునిగిపోయారు.



ఏటూరునాగారం: వినాయకుడికి గరిక మాలను అలంకరిస్తున్న అర్చకులు నాగేశ్వర్‌రావుశర్మ



గోవిందరావుపేట : కుంకుమార్చనలో మహిళలు

క్రైం కార్నర్

గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి



తోలెం పాపారావు(ఫైల్)

వాజేడు: మండలంలోని మండపాక సమీపంలో 163వ నంబర్ జాతీయ రహదారిపై అర్ధరాత్రి గుర్తు తెలియని వాహనం ఢీ కొనడంతో వ్యక్తి మృతి చెందిన సంఘటన గురువారం రాత్రి చోటు చేసుకుంది. స్థానిక ఎస్సై రుద్రారపు హరీష్, బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. మండపాక గ్రామానికి చెందిన తోలెం పాపారావు(50) గత కొంతకాలంగా వెంకటాపురం(కె) మండలంలోని చిరుతపల్లిలో తన బావ వద్ద ఉంటున్నాడు. మండపాకలో గురువారం రాత్రి గణేశుడి నిమజ్జనం కార్యక్రమం ఉండటంతో తను అక్కడి నుంచి వచ్చి పాల్గొన్నాడు. నిమజ్జన కార్యక్రమం పూర్తి కాగానే తిరిగి చిరుతపల్లిలోని బావ వాళ్ల ఇంటికి కాలి నడకన వెళ్తున్నాడు. ఆ సమయంలో గుర్తు తెలియని వాహనం బలంగా ఢీ కొనడంతో రహదారిపై పడిపోగా తీవ్ర గాయాలు కాగా పాపారావు అక్కడికక్కడే మృతి చెందాడు. పాపారావు సోదరుడు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి మృతదేహాన్ని ఏటూరునాగారంలోని మార్చురీకి తరలించినట్లు ఎస్సై తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో ఒకరు..

మంగపేట: మండలంలోని కోమటిపల్లిలో కేసీఆర్ కాలనీకి చెందిన చేల వెంకటయ్య(43) మృతిపై శుక్రవారం అనుమానాస్పద కేసు నమోదు అయినట్లు ఎస్సై టీవీఆర్ సూరి తెలిపారు. ఎస్సై కథనం మేరకు.. గత నెల 31న మృతుడు అదే కాలనీకి చెందిన సోలం ఈశ్వరమ్మతో గొడవ పడి దూషించాడు. తన తల్లిని తిట్టాడనే కోపంతో విషయం తెలిసిన ఈశ్వరమ్మ కుమారుడు శివాజీ ఈనెల 1న ఉదయం వెంకటయ్య ఇంటికి వెళ్లి తన తల్లిని ఎందుకు తిట్టావని గొడవపడ్డాడు. ఈనెల 11న వెంకటయ్య తల నుంచి రక్తం కారుతుందని అతడి కుటుంబ సభ్యులు ఆటోలో ఏటూరునాగారం ఏరియా ఆసుపత్రికి తరలించారు. వైద్యుల సూచన మేరకు ఎంజీఎంలో తరలించారు. చికిత్స పొందుతూ గురువారం మధ్యాహ్నం మృతి చెందాడు. మృతుడి భార్య రాధ చెపుతున్న తీరుతో పోస్టుమార్టం చేసిన వైద్యాధికారి వెల్లడించిన వివరాలకు పొంతన లేక పోవడంతో అనుమానాస్పద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

గ్యాస్ సబ్సిడీ పత్రాల పంపిణీ

ఏటూరునాగారం : తెలంగాణ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న గ్యాస్ సబ్సిడీ మహాలక్ష్మి పథకంలో భాగంగా లబ్ధిదారులకు ఎల్‌పీజీ గ్యాస్ సిలిండర్ రూ.500లకు అందజేస్తున్నట్లు మూడేళ్ల కాలపరిమితి ఉండే హామీ పత్రాన్ని అందజేస్తోంది. మండలంలో సుమారు 14 వేల గ్యాస్ కనెక్షన్‌లున్నాయి. వాటికి జీసీసీ ద్వారా గ్యాస్ సిలిండర్ల సరఫరా జరుగుతుంది. అయితే కొంత మంది ప్రజాపాలనలో ఆన్‌లైన్ చేసుకోకపోవడంతో సబ్సిడీ పడడం లేదు. అంతేకాకుండా కొంత మంది ఇలాంటి హామీపత్రాలు రాకపోవడంతో అధికారులను ప్రశ్నిస్తున్నారు. మరోమారు ప్రజాపాలన ఏర్పాటు చేసి లింక్ చేయని వినియోగదారుల లింక్ చేయాలని విన్నవిస్తున్నారు. గత మూడేళ్ల సగటు వినియోగం ఆధారంగా ఎల్‌పీజీ సిలిండర్లు పరిమితం చేయడం జరుగుతుందని పత్రంలో పేర్కొన్నారు. లబ్ధిదారుడి అర్హతను బట్టి సిలిండ ర్లు వినియోగించడం జరుగుతోంది. సబ్సిడీ నగదు డీబీటీ ఆధారిత ఆన్‌లైన్ బదిలీ ద్వారా ఎవరి బ్యాంకులో వారి నగదు జమ చేయడం జరుగుతుంది. అయితే సబ్సిడీ విషయంలో జాప్యం జరిగితే 1967, 18004250033లకు సమాచారం ఇవ్వాలన్నారు.

రాచపల్లిలో పోషణమాసోత్సవం



మాట్లాడుతున్న సీడీపీఓ ముత్తమ్మ

వెంకటాపురం(కె): మండలంలోని రాచపల్లి గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషణమాసోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీఓ ముత్తమ్మ మాట్లాడుతూ సమతుల్య ఆహారం తీసుకోవటం వల్లనే చిన్నారులు, గర్భిణులు, బాలింతలు ఆరోగ్యంగా ఉంటారని అన్నారు. చిరుధాన్యాలు తినడం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. పిల్లల ఎదుగుదల లేకపోవడానికి కారణం పోషకాహార లోపం వల్లనే జరుగుతుందని అన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి సోహేల్, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు చంద్రకళ, విజేందర్, తదితరులు పాల్గొన్నారు.